# గోడలకి కళ్ళు

"**ఏంతే** చూస్తున్నావు అక్కయ్యా! నాకూ సూపెత్తవూ!" అన్నాడు ఓఅరేళ్ళ కుర్రవాడు, తలుపు సందులోంచి ఆత్రుతగా చూస్తున్న కామాక్షి కొంగు లాగుతూ—

"ఇస్ వెధవా! తప్పు! నువ్వు చూడకూడదు. పోయి పడుకో!" అని కామాక్షి వాడికో మొట్టికాయ పెట్టి తన ధ్యానంలో మునిగింది.

"ఒసే ఏమిటయిందే? నన్నోసారి చూడనీ, అంత యిదయి పోతున్నావేమిటి?" అంది లక్షి పైకి వినబడకుండా...కామాక్షి మొహం మీద మొహం పెట్టి.

"అబ్బ! వుండవే ఛస్తున్నా వేమిటీ! చూడనిస్తావా? ఏదీ..." అని కామాక్షి అక్మిని తోసేస్తూ అంది.

"ఎంతసేపని చూస్తావు? నన్నోసారి చూడనీ."

"ఊఁ! ఆ పక్కనించి చూడవే నన్ను బాధపెట్టక."

ఇలా మొత్తం మీద కిసకిసలాడుకుంటూ కొంచం కాలంలోవున్న ఆడపిల్లలే...నలుగు రైదుగురు...ఆ ద్వారం దగ్గిర మూగి నవ్వుకుంటో గుసగుసలాడుకొంటో మహా 'ఇద'యి పోతున్నారు.

ఇంతలో ఓ వితంతువు వచ్చి.

"అయ్యో! సింగారమ్మా? బావుందర్రా బావుంది. మీరూ మీ వాళకమూను. ఏమిటే చూస్తారు? అలా ఎగబడిపోయి- విరగబడిపోతూ,

సిగ్గులేపూ? పొండి! బాగుపడ్డానికా? ఇలాటివే చెడిపోయేబుద్ధులు. కాలం వుండగా మీకేం తెగులర్రా! పొండి అవతలికి! అవునే నాగులూ, నువ్వూ వున్నావూ? పెళ్ళికాని పిల్లవి. ఆ మాత్రం జ్ఞానం వుండొద్దూ! అయినా నిన్నని ఏంలాభం. పెద్ద వాళ్ళ అదుపూ ఆజ్ఞా వుండాలిగాని. తప్పు! అవునా? ఉండు మీ అమ్మతో చెబుతాను. ఇప్పట్నించే ఇలా అయితే ఆ తర్వాత అయినట్టే వెళ్ళండి ఇళ్ళకి! అలా చూస్తారేం?"

అని కొంచం గద్దించి చెప్పేటప్పటికి ఒక్కొక్కరూ అవతలకి తప్పుకున్నారు. ఇంతా చెప్పిన ఆవిడే సైనుపంచ చెవులకి తగిల్చి, తలుపు సందులోంచి చూడ్డం మొదలెట్టింది. ఈమె వెనకాలే వెంకమ్మగారు కూడా వచ్చింది...

"అవునే వెంకమ్మా. ఎరుగున్నట్టు అంతచనువుగా పలకరిస్తున్నా దేమిటే?" అంది. సందులోంచి చూస్తూనే సుబ్బమ్మ!

"ఏమో మనకేం తెలుసు? పెళ్ళయిం తర్వాత ఏడాది వూరికనే వున్నారుగా-ఆ లోపుని వాళ్ళేం మడిగట్టుకు కూర్చున్నారా? మాటాడు కొనే వుంటారు"

"అయ్యో య్యో య్యో య్యో...!"

ఇది వినగానే——

"ఏమిటే...దొడ్డమ్మా!"...అంటూ మళ్ళీ ఇందాకటి అమ్మాయిలే మెల్లిగా వెనక జేరుకున్నారు.

"ఇదేం చోద్యమొసే! ఇంకా పోలేదూ! ఎంత విరగబడిపోతు న్నారే! మీకేం తెలీదనా? అలా జూస్తారూ? మీకు పెళ్ళిళ్ళవలేదూ? కాపరాలు జేసుకోడం లేదూ? మరీ పిన్నా పెద్దా! మంచీ చెడ్డా!! లేకండా పోతూంది! చూడే వెంకమ్మా."

"అవున్రా అవును! మీరు చిన్నవాళ్ళు. చెడిపోతారు తప్పు! కూడదు. పొండి!"

"ఇన్ని చెబుతూ యిన్నేళ్ళొచ్చి మీకు తెలియక నేనా అంతలా

చూస్తున్నారు?" అని ఆ నలుగురిలో ఎవర్తో పుటుక్కుని అడిగేసింది పుండబట్టక.

"ఆఁ! ఏమిటేమిటి? మా సంగతి వేరు నిన్న కాక మొన్న మా కళ్ళముందు పుట్టి మాకే చెబుతారే? ఎంత పెడసరప్పిల్లలయిపోయి నారే!"

"పదండే పోదాం...మనకెందుకు..." అంటూ ఆ నలుగురూ వీళ్ళకి తెలియకుండా ఆ పక్కనే కిటికీ దగ్గరికి చేరుకున్నారు.

*   *   *   *

"కమలా! ఇన్నాళ్ళ ఎడబాటు నీకు కష్టం అనిపించలేదూ?"

"మీకు లేనిది నా కెందుకుంటుంది...మీతోపాటే నేనూను."

"ఈ మొదటిరాత్రి నీ కెలాటి ఆనందాన్ని ఇస్తూందో చెప్పవూ?"

"............"

"చెబుదూ...!"

"మీకో!"

"నాకే ఎవరనుకుంటారన్న భయం, ఎవరు చూస్తూరో అన్న దిగులూలేకుండా—ఇలా ఉండడంకన్నా...అప్పట్లో దొంగతనంగా... అదేబావుంది."

"అవునండి...ఈ నలుగురిలో నా కదోలా వుంది."

"ఇది అదారంకదూ!''

"అవునుగాని తెల్లవారిం తర్వాత...నలుగురిలోనూ చనువుగా ఎలాగ తిరగడం? నాకు సిగ్గుగా వుంది...పైకి వెళ్ళడానికి..."

"సిగ్గెందుకూ...సహజమైన విషయమే కదూ?''

"అయినా ఏమో అనిపిస్తూంది!"

"పోనీ నా దగ్గరేం సిగ్గులేదుకద!" అని దగ్గరగా తీసుకున్నాడు ఆమెని...

"............"

"రా కమలా! అలా మంచం మీద కూర్చుందాం."

"వద్దండీ...యిప్పుడు...!"

"అదేఁవిటి యింతకు పూర్వమంటే భయంగాని ఇప్పుడేం...ఇహ నెవరూ మన నడిగేవాడు లేడుకదూ!"

"అటు చూడండి!"

"ఎటు?"

"తలుపువైపు."

"ఏం?"

"............"

"ఏం కమలా?"

"చూస్తున్నారు. చప్పుడు వినబడ్డం లేదూ?"

"ఎవరు?"

"అవతలవాళ్ళు!"

"నీకెలా తెలిసింది?"

"నాకు తెలుసు."

"ఆఁ!...ఎంత సిగ్గులేదు! ఏమిటి చూస్తారు? వాళ్ళ మొహం... ఇదేం చూడవలసిందా?"

"ఏమో ఆలా చూస్తారు!"

"అంటే..."

"ఇలా ఎవరికయినా ఈ మూడు రోజులూ చూస్తారు."

"వాళ్ళకి సిగ్గూ లజ్జా లేదూ? అయినా ఎలా చూడగలుగుతారు, తప్పుకాదూ? ఎవరూ వద్దనరూ?"

"పిల్లలయితే పెద్దవాళ్ళు కేకలేస్తారు. కాని పెద్దవాళ్ళే అయితే ఎవళ్ళనగలరు?"

"బావుంది ఇదీ ఆచారమేనా ఏమిటి? కొంపదీసి!"

"ఏమో నేనోసారి మాటవరసని అడుగుతే అలానే అన్నారు!"

"బావుంది...యీ ఆడవాళ్ళకి మరేం పనులుండవు కామోసు !"

"అందులోనూ వెధవ్వాళ్ళకి."

"ఇలా ఎంతసేపని చూస్తారు?"

"తెల్లవారులూనూ వాళ్ళకేమిటి !"

"తెల్లవార్లునా ? ఇదేం బావుండలేదు...వాళ్ళకి తగిన బుద్ధి చెప్పాలి..."

"అదేమిటండీ ! వాళ్ళపని వాళ్ళదీ మన కెందుకూ ? అయినా వాళ్ళకి సిగ్గుండాలిగాని...ఎవరూ చెయ్యలేకే [ పూరుకున్నారా !"

అలాక్కాదు! ఇదేం జంతుప్రదర్శనశాల అనుకున్నారా?"

"అదేమిటండోయ్ !"

"అవును. కాదు మరీ...బోనుల్లోనూ...యినపగజాల్లోనూవున్న జంతువులేం చేస్తున్నాయో ఎలా వున్నాయో...'జూ'ల్లో చూస్తారు... అలాగే ఇక్కడ యీ గదిలో మనం ఏం చేస్తున్నామో వీళ్ళు చూస్తున్నారు...అంతేకదూ...మరేం తేడా వుంది...ఛీఛీ...మనుష్యులా పశువులా ? ఇదెలా వచ్చిందో మనకి..."

"ఇది అనాదినుండి వస్తున్నదే !"

"అవును. అదే నేనూ అంటున్నా...ఇలాటి అసభ్యమైనఆచారం మనలో ఎలా ఇన్నాళ్ళనుండి పాతుకుపోయింది ? పూర్వులు ఇదంతా చూస్తూ ఎలా వూరుకున్నారు...పోనీ ఇదో ఆచారం అని అనుకున్నా, ఈ పై చూపుల్లో అర్థం, లాభం ఏమిటుందని? పూర్వం వాళ్ళు ఇలాటి వాటికి వూరుకున్నా...ఇప్పటివాళ్ళు కిది కిట్టదు...అవునా ! నువ్వే చెప్పవు...ఇప్పుడు...అయినా అసలు యీ నలుగురిలోనూ ఇదో పెద్ద మనకార్యంలా...అందరూ చూస్తూండగా ఒక పురుషుణ్ని ఒక స్త్రీని... వేరే...గదిలో పెట్టడం అన్నదే తప్పు—దీనివల్ల...భార్యాభర్తల సాంఘవ్యం యీ నాటినుండీ శారీరకంగా కలిసింది. అని లెక్కచేసు కుంటికి ఉపకరించి, ఆ తర్వాత ఎన్నో ఇబ్బందులు...లేకండా చెయ్య

దానికి పెద్దలు ఆలోచించి పెట్టారు. అయితే యీ దొంగచూపులేమిటి? యిదేం బాగులేదు...వీళ్ళకి తగిన బుద్ధి చెప్పాలి! వీళ్ళేం చిన్నవాళ్ళా చితకవాళ్ళా! అన్నీ తెలిసినవాళ్ళే యిలా చూడ్డం ఏమిటి కొత్తగా!"

"బావుండదండీ! అనవసరంగా అందరూ ఆ తర్వాత అనుకుంటారు మన కెందుకు!"

"నువ్వేమీ మాటాడకు! అలా చూస్తుండు మర్నాడు మళ్ళీ చెయ్యకుండా చేస్తాను!"

"ఒహదాని కొహటి వస్తుందండీ!"

"ఏవీరాదు. తేలుకుట్టిన దొంగల్లా వాళ్ళే నోరు మూసుగొని పూరుకుంటారు నువ్వూరుకో."

అని అతడు తలుపు దగ్గరికి వెళ్ళేడు. యీ మాటలన్నీ పైనున్న వాళ్ళకి వినబడలేదా అని అంటారేమో ఎమో! అయినా వాళ్ళు యిలాటి పుణ్యకాలాన్ని వదులుకుంటాఅ?

యీయన యిలా అకస్మాత్తుగా గభాలున తలుపు తీసేటప్పటికి ఆ గాభరాలో అక్కడున్న అమ్మలక్కలు ఎటు పోడానికీ తోచక తబ్బిబ్బు పడ్డారు...అయితే ఆ వితంతువు లిద్దరూ...అంతలాటిసమయంలోనూ అనుభవం వున్నవాళ్ళు గాబట్టి, వాకిటి ద్వారం తొన్న తప్పుగున్నారు...కాని...అదుపు ఆజ్ఞల్లో వున్న ఆ అమ్మాయిలు మాత్రం ఏమీ తెలియక భయంతో పెరట్లోకి పారిపోయారు! అతడు యీ రెండు తలుపులూ గడియవేసి గదిలోకి పోయేడు...కర్మవశాత్తూ ఆయన అనుకున్న విధంగానే జరిగింది, ఏమంటే ఆ నాడు అమర్చబడ్డ గది-వేరే కేటాయింపుగా వుంది. ఆ గది నానుకునే చిన్న సావిడి వుంది. ఆ గదికిపోయే ద్వారం ఆ సావిడిలో నుండే వుంది. మరే తొన్నా లేదు. ఒహ కిటికీకూడా అందులోనే వుంది. ఆ సావిడికి ఒక ప్రక్క వాకిట్లోకి వచ్చే ద్వారం, రెండో ప్రక్క... పెరట్లోకి పోయే ద్వారం వున్నాయి. అంతే పెరట్లోకి వెళ్ళాలన్నా అటుండి రావాలన్నా యీ సావిడిగుండానే

రావాలిగాని మరో దారీతెన్నూ లేదు. పెరటి గోడలయినా చాలా ఎత్తుగా దాటడానికయినా వీలు లేకుండా వున్నాయి. అంచేత...అమ్మలక్కలు చూడాలంటే యీ సావిట్లోంచే చూడాలి. అలాగనే చూసి అతను తలుపు తియ్యగానే అమాయకంగా పెరట్లోకి పరుగెట్టేరు !

"కమలా ! అయిపోయింది."

"ఏమిటండీ? ఏం చేశారు?"

"నే ననుకున్నట్లు వాళ్ళు పెరట్లోకే పరుగెత్తేరు...వెంటనే రెండు తలుపులూ ఘడియవేసి వచ్చేను."

"మంచి...పని...చేసారే!..." అని నవ్వుకుంది.

"యిహ నెలా చూస్తారు!"

"బాగుంది కానండీ...వెళ్ళి తలుపు తీసేయండి బావుండదు——"

"ఏం !"

"మరి పెరట్లోంచి దారిలేదు...యీ చలిలో తెల్లవార్లూ మనల్ని తిడతారు!"

"కావాలి! అలా అయితేనేగాని బుద్ధిరాదు !"

"వద్దండీ నామాట వినరూ! ఆ తర్వాత నానా మాటలూ అంటారు...అదీగాక వాళ్ళవాళ్ళు వెతుక్కుంటారు !"

"వెతుక్కోనీ, ఏమవనీ, యివాళల్లా వాళ్ళక్కడ వుండవలసిందే, బాగా ఇంటిదగ్గర చీవాట్లయితేనేగాని...రోగం కుదరదు !"

"మీ ఇష్టం. నే చెప్పాను బావుండదని. నా మాటవిని అలా చెయ్యండి."

"నువ్వేమన్నా సరే తియ్యను...పద పడుకుందాం."

"బావుందండీ మరీను...మన కెందుకీ గోల."

* * * *

"తలుపు ఘడియ వేసినట్టుందే కామాక్షీ..." అంది లక్ష్మి భయంతో.

"అవును. నిజంగానే వేసాడు...చచ్చాం...ఎలాగ ?" అంది వణుకుతూ కామాక్షి.

"అవునర్రా...మరోద్వారం కూడా లేదు. ఎలాగ నాకు భయం వేస్తూంది!" అంది సుబ్బులు.

"ఒసే...నాకు అదోలా వుందే...మా అమ్మ-నాన్న—ఏమం టారో!" అంది నాగులు.

"ఆవును ఏరి చెప్మా!"

"అవునుగాని వెంకమ్మా, సుబ్బమ్మా ఏరీ ?"

"బాగా తప్పించుకు పోయారే! ఆ ద్వారానపోయి వుంటారు ! మధ్య మనమే బాగా వుండిపోయాం!"

"చెప్పలేనమ్మకి ఏడవ సిగ్గు ! తలుపు మరి తియ్యకపోతే తెల్లార్లూ ఈ చలిలో ఎలాగు? మా ఆయన ఏమంటారో ! ఏ మొహం పెట్టుకు వెళ్ళడం!"

"నేరక చూసేం...అసలే నామీద అతనికి కోపం...ఇంక తెల్లారే వరకూ ఇంటికి జేరుకోకపోతే ఒళ్ళు హూనం చేస్తారు. నాకేం పాలు పోలేదు," అంటూ ఏడ్చింది సుబ్బులు.

"ఎడవకే సుబ్బులూ—ఏం చేస్తాం...చేసుకున్నది అనుభవించక తప్పుతుందా ! వీడమ్మ కడుపు బంగారంకానూ ? ఎంతపని జేశాడే! ఎలా తెలిసిందో మనం చూస్తున్నామని. మాకు మాత్రం బెంగలేదూ ? అసలే మా ఆయన అనుమానం మనిషి...ఏమంటాడో!" అంది కామాక్షి.

"చంటిపిల్లని ఉయ్యాల్లో వదిలేసి వచ్చేను. మధ్యాహ్నం పట్టిన పాలు...చిచ్చుపెడతాడు...ఎలా పోనూ!" అని అంది లక్ష్మి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

"తలుపు పిలిస్తే ఆ దోవని ఎవరయినా వచ్చి తీస్తారేమో !"

"లేదు! ఆ ద్వారంకూడా వేసేశాడు చప్పుడయింది. ఇహ మన గతి ఇంతే! వాళ్ళతో ఏమని చెప్పుకోడం!"

"మా గొప్పపని చేశాడులేవే! ఇదేం వేళాకోళమేమిటి? మర్యాదా మప్పితం వుండవద్దూ! ఎవరికీలేంది వీడికే వచ్చిందా? మనకాలంలో మన వాళ్ళిలాగే చేశారా?"

"పోనీ తలుపు తియ్యమని దాంతోనే నాచెబుతే!"

"బావుందే! ఏమని అడుగుతాం అయినా ఏం బావుంటుంది. ఇలాం టప్పుడు. చూద్దాం ఎప్పటికయినా తియ్యకపోడు!"

"ఈ మూడురోజులూ అయినాక వీడు చూడమని బ్రతిమాలు కున్నా చూస్తారా ఏమిటే!"

"ఆఁ ఎవరిక్కావాలి! ఏం తెలియందా ఏమిటి?"

"అసలు మనం చూడ్డం నిజంగా తప్పే!"

"ఇలా అవుతుందని అనుకున్నామా! నలుగురూ చూస్తున్నారని చూసేంగాని"

"ఏదో అనాదినుండి వస్తున్నదీ...ఎప్పుడూ జరుగుతున్నదే అను కున్నాం గాని..."

"అప్పుడే రెండుగంటలవుతూంది ఇంకా తీసేట్టు లేదే!"

"మరింక వీడుతియ్యడే! వీడి సిగ్గు బొగ్గులవా!"

"అయితే మరేం చెయ్యడం."

"ఏంచేస్తాం. ఇక్కడే తెలారేవరకూ కునుకుతీద్దాం"

"అమ్మయ్యో! రాత్రెల్లానా? రేపు ఏంమొహం పెట్టుకుని ఇళ్ళకి వెడతాం. ఏమని చెపుతాం ఏమైనా వుందీ!"

"అవును నిజమేగాని వీడిలా మొండికెత్తి కూర్చున్నాడాయె! ఎలాగు మరి?"

"అంతే తిట్లు తినవలసిందేను!"

"అదుగో అప్పుడే నాగులు కుసికేస్తుంది!"

"అవునే నాకూ నిద్ర వస్తూంది!"

"అయితే రండి ఇంకెందుకూ! ఆ వరండాలోనే తొంగుదాం!"

అని ఇలా తర్కించుకుంటూ ఆఖరికి ఏం చేసేది లేక అందరూ కొంగులు పరుచుకుని పడుకున్నారు.

* * * *

"అవునే వెంకమ్మా...మనం అలా వాకిటే తొన్న తప్ప గున్నామూ! మన పుణ్యం బావుంది. ఆ గుంటలు నలుగురూ చచ్చారు!" అని అంది సుబ్బమ్మ

"ఏం జరిగింది?" అని అడిగింది వెంకమ్మ.

"ఆ తర్వాత వాడు రెండు తలుపులూ బిగించేశాడట. వాళ్ళు పెరట్లోంచి బయటపడ్డానికి దారిలేక అంతసేపూ ఆ చల్లో నానా బాధ పడ్డారట!"

"పోత్రం బాగా అణిగిందిలే! మనం చెబితే విన్నారా! పెళ్ళిళ్ళయి కాపురాలు చేస్తూన్నవాళ్ళు సిగ్గులూ లజ్జలు వుండొద్దూ! మొగుళ్ళదగ్గర ఆమాత్రం భయం వుండకపోతే ఎలాగ?"

"అవునవును! మనలాటివాళ్ళం చూసినా అర్థంవుంది. ముద్దూ ముచ్చటా. వాళ్ళకేం రోజూ ఎరిగున్నదేకదూ!" అని మొహం అదోలా పెట్టి అంది.

"అవునే విన్నావా? వాడి అనుమానం మండా!

ఆ కామాక్షి మొగుడు—అది తెల్లవార్లూ ఇంటికి రాలేదని, మర్నాడు నానాతిట్లూ తిట్టి దాన్ని పుట్టింటికి తోలేశాడట! ఏమయినా బావుందీ?"

"అలాగా! ఇది విన్నావా? సుబ్బుల్ని మరి లేవలేకుండా చితక తన్ని వదిలేడట దాని మొగుడు. పాపం ఆ దెబ్బలకి అదికాబట్టి ఓర్చింది జ్వరంతో మూలుగుతూందిట నిజమేనా?"

"అవునే నేచూశాను! పాపం ఏడుస్తూంది. లక్ష్మి మొగుడు... ఇంట్లో ఆ వేళకి లేకపోబట్టి సరిపోయింది. అయినా వాడంత తొందర మనిషి కాడు లేవే!"

"నాగులెక్కడా కనిపించడం లేదేం. ఎప్పుడూ వీధిలోనే ఉండేది"

"ఇంకెందుకు కనిపిస్తుంది? ఆ రోజుని వాళ్ళ నాన్న ఇంకెక్కడేనా తిరుగుతున్నట్టు కనిపిస్తే దాన్ని వాళ్ళమ్మనీకూడా పూరుకోమన్నాడుట! అంచేత వాళ్ళమ్మ ఎక్కడికీ పంపడం మానేసింది!"

"మంచి పని అయిందిలేవే. ఆపాటి భయభక్తుల్లో వుంచాలి...! అయినా మనకెందుకులే. గోడలకి చెవులుంటాయి. పూరుకో ఎటొచ్చి మనమీద విరుచుకు పడతారు" అని ఇలా ఆ ఇద్దరూ అక్కసు వుండబట్టక వాళ్ళమీద అనుకున్నారు.

ఆంధ్రపత్రిక 26-3-52